సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
07 ఆగస్టు 2024
పేజీలు: 02

PARIS 2024 మెడల్స్ టేబుల్

| దేశం | బంగారం | వెండి | కాంస్యం | మొత్తం |
|---|---|---|---|---|
| అమెరికా | 24 | 31 | 31 | 86 |
| చైనా | 22 | 21 | 16 | 59 |
| ఆస్ట్రేలియా | 14 | 12 | 9 | 35 |
| ఫ్రాన్స్ | 13 | 16 | 19 | 48 |
| బ్రిటన్ | 12 | 13 | 17 | 42 |
| జపాన్ | 10 | 5 | 11 | 26 |
| ఇండియా | 0 | 0 | 3 | 3 |

# ఫోగాట్ విజయ గర్జన

## ఒలింపిక్స్ ఫైనల్‌కు తొలి భారత మహిళా రెజ్లర్







భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ సంచలన ప్రదర్శనతో పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. గతేడాది దేశ క్రీడారంగంలో 'వార్త'గా నిలిచిన ఆమె తన బాధనంతా పంటికింద బిగపట్టి విశ్వక్రీడల్లో అత్యద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మంగళవారం మహిళల ఫ్రీస్టయిల్ 50 కిలోల సెమీఫైనల్స్‌లో ఫోగాట్.. 5-0తో యుస్నెలిస్ గుజమన్ (క్యూబా)ను ఓడించి స్వర్ణ పతక రేసులో నిలిచింది. తద్వారా తాజా ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి స్వర్ణం లేదా రజతం అందించే అవకాశాన్ని దక్కించుకుంది. ఇప్పటి వరకు భారత్‌కు మూడు కాంస్య పతకాలు రాగా అవి షూటింగ్‌లో వచ్చినవే. రెజ్లింగ్ ఫైనల్ చేరడం ద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా వినేశ్ నిలిచింది. 2016 రియో ఒలింపిక్స్ నుంచి ఈ క్రీడల్లో ఆడుతున్న ఫోగాట్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. బుధవారం జరిగే ఫైనల్‌లో ఆమె యూఎస్‌ఏకు చెందిన హిల్డెబ్రండ్ట్ సారాతో అమీతుమీ తేల్చుకోనుంది.

తొలి బౌట్ 90 సెకన్ల పాటు ఇరువురూ ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించేందుకు యత్నించారు. దీంతో సుసాకీ వ్యూహం మార్చి దూకుడు పెంచింది. రెండో బౌట్ సగం ముగిసేదాక వినేశ్ 0-2తో వెనుకబడే ఉంది. కానీ మరో 20 సెకన్లలో ఆట ముగుస్తుందనగా మొదలైంది అసలు కథ. సుసాకీ ఎడమ కాలును ఉడుము పట్టినట్టు పట్టిన వినేశ్ ఆమెను మ్యాట్‌పై పడేసింది. అంతే..! 3-2తో మ్యాచ్ గెలిచిన వినేశ్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సుసాకీతో మ్యాచ్‌లో ఇచ్చిన గెలుపుతో వినేశ్ క్వార్టర్స్‌లో రెచ్చిపోయింది. రెండో మ్యాచ్‌లో 7-5తో ఉక్రెయిన్ రెజ్లర్ ఒక్సానా లివాచ్‌నూ మట్టికరిపించి సెమీస్‌కు అర్హత సాధించింది.

సెమీస్‌లో..

కీలక సెమీస్‌లోనూ వినేశ్ దూకుడు చూపించింది. ఆత్మవిశ్వాసంతో మ్యాట్‌పైకి వచ్చిన ఆమె.. బౌట్ ఆరంభమైన కొద్దిసేపటికే ప్రత్యర్థిని కింద పడేసి హాఫ్ టైమ్ ముగిసేసరికి 2 పాయింట్లు సాధించి ఆధిక్యంలో నిలిచింది. రెండో బౌట్‌లో జుమాల్ రెండు కాళ్ల మధ్య అష్టదిగ్బంధనం వేసినట్టుగా మంత్రం వేయడంతో జుమాల్ ఆ పట్టును విడిపించుకోలేక చతికిలపడింది.



### తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన వినేశ్ ఫొగాట్..?

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఆసుపత్రిలో చేరినట్లు తెలిసింది. డీహైడ్రేషన్ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురైనట్లు సమాచారం. దీంతో ఆమెను అధికారులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. బరువు తగ్గడం కోసం ఫొగాట్ రాత్రంతా స్కిప్పింగ్, సైక్లింగ్, జాగింగ్ చేశారని.. దాని కారణంగా డీహైడ్రేషన్‌తో అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ప్రస్తుతం పారిస్‌లోని ఆసుపత్రిలో వినేశ్ చికిత్స తీసుకుంటున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి.కాగా, రెజ్లింగ్ ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్ పై అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే. 50 కేజీల ఫ్రీ స్టయిల్ రెజ్లింగ్‌లో పోటీ చేసిన వినేశ్ ఫొగాట్.. ఫైనల్‌కి ప్రవేశించింది. నంబర్ వన్ రెజ్లర్ సుసాకిపై విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. దీంతో అంతా పతకం ఖాయమని అనుకున్నారు. అయితే, అనూహ్యంగా బరువు పెరిగిన కారణంగా ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. ఫైనల్ గేమ్‌కు కొద్ది క్షణాల ముందు ఈ పరిణామం చోటు చేసుకుంది. నిబంధనల ప్రకారం ఉండాల్సిన 50 కేజీల బరువు కంటే ఫొగాట్ 100 గ్రాములు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆమెపై అనర్హత వేటు వేస్తూ ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ నిర్ణయం తీసుకున్నాయి. అనర్హత కారణంగా ఆమె పతకం గెలిచే అవకాశం కోల్పోయింది.



## ఢిల్లీలో మనుబాకర్‌కు ఘన స్వాగతం

### మళ్లీ శనివారం పారిస్‌కు భారత షూటర్!

పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన యువ షూటర్ మను బాకర్‌కు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు ఢిల్లీ విమానాశ్రయంలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. బాకర్‌తోపాటు కోచ్ జస్పాల్ రాణా ఉన్నారు. అభిమానులు పెద్ద ఎత్తున పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం ఆమె కారులో ర్యాలీగా బయలుదేరారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ సింగిల్, మిక్స్‌డ్ విభాగంలో మను బాకర్ కాంస్య పతకాలు సాధించిన విషయం తెలిసిందే. "భరతమాత బిడ్డ సగర్వంగా పతకాలతో వచ్చింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలను సాధించి చరిత్ర సృష్టించింది. కేవలం 22 ఏళ్ల వయసులో రికార్డు నమోదు చేసింది. ఆమెతోపాటు పారిస్ నుంచి కోచ్ జస్పల్ రాణా వచ్చారు. అతడు నా కుమారుడు అని చెప్పేందుకు గర్వపడుతున్నా. భారత షూటింగ్‌కు వైభవం తీసుకొచ్చాడు. అభినవ్ బింద్రా దీనికి పునాది వేశారు" అని జస్పల్ రాణా తండ్రి నారాయణ సింగ్ రాణా ఆనందం వ్యక్తంచేశారు.

**మళ్లీ పారిస్‌కు..**

ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు మనుబాకర్ మళ్లీ పారిస్ వెళ్లనుంది. శనివారం బయల్దేరి అక్కడికి చేరుకోనుంది. భారత పతాకధారుల్లో ఆమె ఒకరు. ఆదివారం జరిగే వేడుకలకు హాజరుకానుంది. ఈలోగా క్రీడల మంత్రిని ఇవాళ మధ్యాహ్నం కలవనుంది.




## ఫైనల్‌కు నీరజ్ చోప్రా

### తొలి ప్రయత్నంలోనే 89.34 మీటర్ల దూరం

ఎవరి అంచనాలకూ అందకుండా టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గిన 'బల్లెం వీరుడు' నీరజ్ చోప్రా 'పారిస్'లో దానిని నిలబెట్టుకునేందుకు వేట మొదలుపెట్టాడు. మంగళవారం ప్రఖ్యాత స్టేట్ డి ఫ్రాన్స్ స్టేడియం వేదికగా జరిగిన జావెలిన్ త్రో క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈటెను 89.34 మీటర్లు విసిరిన అతడు అగ్రస్థానంతో ఫైనల్స్‌లో ఘనంగా అడుగుపెట్టాడు. ఈ సీజన్‌లో నీరజ్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కాగా మొత్తంగా రెండో (2022లో 89.94 మీటర్లు)ది. క్వాలిఫికేషన్ రౌండ్ గ్రూప్-ఏ లో జర్మన్ అథ్లెట్ వెబర్ జులియన్ 87.76 మీటర్లతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. గ్రూప్-బీతో పాటు రెండు గ్రూపులలోనూ నీరజ్‌దే అత్యుత్తమ ప్రదర్శన. ఓవరాల్‌గా గ్రెనెడాకు చెందిన అండర్సన్ పీటర్స్ (88.63 మీటర్లు), వెబర్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ 86.59 మీటర్లతో 4వ స్థానంలో నిలిచాడు. అర్హత రౌండ్స్‌లో జావెలిన్‌ను 84 మీటర్లు దాటినవాళ్లు ఫైనల్స్‌కు వెళ్తారు. రెండు గ్రూపులలో కలిసి ఫైనల్స్‌కు 12 మంది క్వాలిఫై అయ్యారు. భారత్‌కే చెందిన కిషోర్ జెన 80.73 మీటర్లతో క్వాలిఫికేషన్ రౌండ్స్‌లోనే తేలిపోయాడు.

## కాంస్య పోరుకు ఇండియా హాకీ టీమ్

ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో వరుస విజయాలతో దుమ్మురేపిన ఇండియా కీలక పోరులో తడబడింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ పసిడి పోరుకు అర్హత సాధిస్తునుకున్న టీమ్‌ఇండియా సెమీఫైనల్ పోరులో నిరాశపరిచింది. మంగళవారం ఆఖరి నిమిషం వరకు హోరాహోరీగా సాగిన పోరులో ఇండియా 2-3 తేడాతో జర్మనీ చేతిలో పోరాడి ఓడింది. మ్యాచ్ ఆద్యంతం ఇరు జట్ల మధ్య పోరు రసవత్తరంగా సాగింది. గత(టోక్యో) ఒలింపిక్స్‌లో తమకు ఎదురైన ఓటమికి పారిస్‌లో భారత్‌పై ప్రతీకారం తీర్చుకున్నారు. మ్యాచ్ మొదలైన తొలి రెండు నిమిషాల్లోనే టీమ్‌ఇండియాకు రెండు పెనాల్టీ కార్నర్లు లభించాయి. ఇండియా తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్(7ని), సుఖ్‌జీత్‌సింగ్(36ని) గోల్స్ చేశారు. మరోవైపు గొంజాలో పిలియట్(18ని), క్రిస్టోఫర్ రర్(27ని), మార్కో మిల్టక్(54ని) జర్మనీకి గోల్స్ అందించారు. మ్యాచ్ విషయానికొస్తే తొలి క్వార్టర్ ఏడో నిమిషంలో దక్కిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్‌సింగ్ అద్భుత రీతిలో గోల్‌గా మలువడంతో ఇండియా 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే రెండో క్వార్టర్ మొదట్లోనే పిలియట్..పెనాల్టీ కార్నర్ గోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. మరో తొమ్మిది నిమిషాల తేడాతో క్రిస్టోఫర్ గోల్ చేయడంతోజర్మనీకి 2-1 ఆధిక్యం దక్కింది. మ్యాచ్‌పై పట్టు కోల్పోతున్న సమయంలో సుఖ్‌జీత్‌సింగ్ గోల్‌తో ఇండియా పోటీలోకి వచ్చింది. సమంగా సాగుతున్న మ్యాచ్ మరో ఆరు నిమిషాల్లో ముగుస్తుందనగా మార్కో ఫీల్డ్ గోల్‌తో జర్మనీ మ్యాచ్‌ను తమ వైపునకు తిప్పుకుంది. ఆఖరి క్షణంలో ఇండియాకు గోల్ చేసే అవకాశం వచ్చినా..తృటిలో చేజారిపోయింది. రేపు ఇండియా, స్పెయిన్ మధ్య కాంస్య పోరు జరుగనుండగా, పసిడి కోసం నెదర్లాండ్స్, జర్మనీ తలపడనున్నాయి.





## రెజ్లర్ వినేశ్ ఫోగట్‌పై వేటు బాధిపెడుతోంది

పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతకాన్ని గెలుచుకునే అవకాశాన్ని రెజ్లర్ వినేశ్ ఫోగట్ చేజార్చుకున్నది. ఓవర్ వెయిట్ కారణంగా ఆమెను అనర్హురాలిగా ప్రకటించారు. వాస్తవానికి ఇవాళ ఆమె గోల్డ్ మెడల్ మ్యాచ్ ఆడాల్సి ఉన్నది. అయితే వినేశ్ ఫోగట్ డిస్‌క్వాలిఫై అయిన నేపథ్యంలో.. భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. వినేశ్, నువ్వ చాంపియన్లకే చాంపియన్ అంటూ ఆయన ఎక్స్ అకౌంట్‌లో కామెంట్ చేశారు. భారత దేశానికి గర్వకారణమని, ప్రతి ఒక్క భారతీయుడికి ప్రేరణగా నిలుస్తున్నావని తెలిపారు. నిజానికి వేటు పడడం అది ఎంతో బాధిస్తుందన్నారు. చాలా నిరాశకు లోనయ్యానని, ఆ విషయాన్ని మాటల్లో చెప్పలేమన్నారు. నువ్వు మరింత పట్టుదలతో రాణిస్తావని ఆశిస్తున్నట్లు చెప్పారు. సవాళ్లను ఎదుర్కోవడం నీ నైజమని ఆయన అన్నారు. మరింత బలంతో పుంజుకోవాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. నీకు మేం అందరం సపోర్టుగా ఉంటామని మోదీ తన ట్వీట్‌లో వెల్లడించారు. 50 కేజీల ఫ్రీ స్టయిల్ రెజ్లింగ్‌లో పోటీ చేసిన వినేశ్ ఫోగట్.. ఫైనల్‌కి ప్రవేశించింది. కానీ సుమారు 100 గ్రాముల అధిక బరువు నమోదు కావడంతో.. ఆమెపై వేటు విధించారు. దీంతో భారత ఒలింపిక్ బృందంలో నిరాశలు నెలకొన్నాయి. వినేశ్ విషయంలో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో ప్రధాని మోదీ ఫోన్లో మాట్లాడారు. అసలు ఏం జరిగిందో ఆయన అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం వద్ద తమ నిరసన వ్యక్తం చేయాలని పీటీ ఉషను మోదీ కోరినట్లు తెలుస్తోంది.

## గోల్డ్ మెడల్ మ్యాచ్ ఆడనున్న ఆ వివాదాస్పద బాక్సర్

అల్జీరియా బాక్సర్ ఇమేని ఖాలిఫ్ పై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. జెండర్ ఎలిజిబిలిటీ టెస్టులో విఫలమైన ఆ బాక్సర్.. పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల విభాగంలో పోటీపడుతున్నారు. ఇమేని పంచ్‌లు తట్టుకోలేకపోయిన ఇటలీ బాక్సర్ మ్యాచ్ మధ్యలోనే వైదొలిగింది. ఆ తర్వాత కూడా ప్రతి రౌండ్‌లో ప్లేయర్లు ఇమేని పంచ్‌లకు భీతిల్లిపోతున్నారు. కానీ ఇమేనీ మాత్రం పట్టుదలతో ముందుకు దూసుకెళ్తోంది. సెమీఫైనల్లో జంజేమ్ సువాన్నపెంగ్‌పై విజయం సాధించి ఫైనల్లో ప్రవేశించింది. మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో క్వార్టర్స్‌లోనే ఇంటి ముఖం పట్టిన ఇమేనీ ఈసారి మాత్రం ఫైనల్లోకి ప్రవేశించి పసిడి పతకంపై కన్నేసింది. గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో చైనా క్రీడాకారిణి లియూ యాంగ్‌తో తలపడనున్నది.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## హసీనా తండ్రి బయోపిక్‌లో నటించిన..

# యువ హీరో దారుణ హత్య





రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న అల్లకల్లోల పరిస్థితుల కారణంగా షేక్ హసీనా ప్రధాని పీఠం నుంచి దిగిపోయి, దేశాన్ని వీడాల్సి వచ్చింది. ఆమె రాజీనామా చేయగానే అవామీలీగ్ మద్దతుదారులను లక్ష్యంగా చేసుకొని అల్లరిమూకలు హింసాకాండకు పాల్పడ్డాయి. ఈ క్రమంలోనే ఓ యువ నటుడు, దర్శకుడైన అతడి తండ్రిని నిరసనకారులు అతికిరాతకంగా చంపేశారు. కాగా.. ఈ నటుడు గతంలో హసీనా తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ బయోపిక్‌లో నటించడం గమనార్హం. బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ జీవితం, కెరీర్ తొలినాళ్లలో జరిగిన సంఘటనల ఆధారంగా బంగ్లాదేశ్‌కు చెందిన దర్శకనిర్మాత సలీమ్ ఖాన్ 2021లో ఓ సినిమాను తెరకెక్కించారు. 'తుంగిపరార్ మియా భాయ్' పేరుతో నిర్మించిన ఈ సినిమాలో సలీమ్ కుమారుడు, నటుడు శాంతో ఖాన్.. హసీనా తండ్రి రెహమాన్ యుక్తవయసు పాత్రను పోషించాడు. ఈ సినిమాతో శాంతో ఖాన్ కెరీర్ మలుపుతిరిగింది. చిత్రానికి కూడా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పెరిగింది. అయితే, సోమవారం హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశారన్న వార్త బయటకు రాగానే శాంతో, సలీమ్‌ను ఆందోళనకారులు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తండ్రీకుమారులు చాంద్‌పుర్‌లోని తమ స్వగ్రామానికి పారిపోయేందుకు ప్రయత్నించారు. మార్గమధ్యలో ఆందోళనకారులు వీరిని అడ్డుకున్నారు. ఆత్మరక్షణ కోసం వీరు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారు. కానీ, అప్పటికే నిరసనకారులు వీరిని చుట్టుముట్టి కర్రలతో కొట్టి చంపినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. ఈ తండ్రీకొడుకులకు భారత సినీ రంగంతోనూ అనుబంధం ఉంది. పశ్చిమబెంగాల్‌లోని టాలీవుడ్‌లో సలీమ్‌ఖాన్ పలు సినిమాలను నిర్మించారు. శాంతో కూడా కొన్ని బెంగాలీ చిత్రాల్లో నటించి భారత ప్రేక్షకులకు చేరువయ్యారు. వీరి మృతి గురించి తెలియగానే పలువురు బెంగాలీ సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సలీమ్‌ఖాన్ స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించేవారు. హసీనా, ఆమె పార్టీతో ఈయనకు సన్నిహిత సంబంధాలున్నాయి.

### గాయకుడి ఇంటికి నిప్పు..

ఢాకాలోని ప్రముఖ బంగ్లాదేశీ జానపద గాయకుడు రాహుల్ ఆనందో నివాసానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. నిరసనకారులు దాడి చేయగానే రాహుల్ కుటుంబం అక్కడినుంచి పారిపోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వారు రహస్య ప్రాంతంలో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. సాంస్కృతిక హక్కుల కార్యకర్త అయిన రాహుల్ నివాసం అతి పురాతనమైనది. 140 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఇంటిని కల్చరల్ హబ్‌గా మార్చి అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 2023 సెప్టెంబరులో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఢాకా పర్యటనకు వచ్చినప్పుడు ఈ నివాసాన్ని సందర్శించారు. ఈ ఇంట్లో రాహుల్ స్వయంగా డిజైన్ చేసిన దాదాపు 3వేల వాయిద్య పరికరాలు ఉన్నాయట. వాటిని ఆందోళనకారులు ధ్వంసం చేసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.



# 24 మంది సజీవదహనం

### అవామీ లీగ్ నేత హోటల్‌కు నిప్పు పెట్టడంతో ఘోరం

**అల్లర్లలో ఇప్పటివరకు 440 మందికి పైగా మృతి**

రాజకీయ సంక్షోభంలో చిక్కుకున్న బంగ్లాదేశ్‌లో అరాచక శక్తులు పేట్రేగిపోతున్నాయి. దేశవ్యాప్తంగా బీభత్సం సృష్టిస్తున్నాయి. షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ నేతలపై ఆందోళనకారులు దాడులకు తెగబడుతున్నారు. వారి ఇండ్లు, వ్యాపారాలను ధ్వంసం చేస్తున్నారు. జోహోర్ జిల్లాలో అవామీ లీగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షహిన్ ఛక్లదర్‌కు చెందిన జబీర్ ఇంటర్నేషన్ హోటల్‌కు సోమవారం రాత్రి అల్లరిమూక నిప్పు అంటించింది. ఈ ఘటనలో 24 మంది సజీవ దహనమయ్యారు. మృతుల్లో ఇండోనేషియాకు చెందిన ఒక వ్యక్తి కూడా ఉన్నారు. పలువురు హోటల్ సిబ్బంది తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. హోటల్ శిథిలాల్లో మరిన్ని మృతదేహాలు లభించే అవకాశం ఉందని సిబ్బంది చెప్తున్నారు.


**440కు చేరిన మృతుల సంఖ్య**

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారగా, ఇప్పటివరకు 440 మంది మరణించారు. ఆదివారం, సోమవారం చెలరేగిన హింసతో ఎక్కువ ప్రాణనష్టం జరిగింది. పోలీసులు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో దాదాపు 250 మందికి పైగా మరణించినట్టు స్థానిక మీడియా పేర్కొన్నది. సోమవారం హసీనా రాజీనామా తర్వాత అల్లర్లు మరోరూపం దాల్చాయి. అప్పటివరకు పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య గొడవలు జరగగా.. హసీనా రాజీనామా తర్వాత ఆందోళనకారులు అవామీ లీగ్ పార్టీకి చెందిన నేతలను లక్ష్యంగా చేసుకున్నారు.

## బీజేపీలో విలీనం అవాస్తవం: బీఆర్ఎస్ నేత



బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కానుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆ పార్టీ నేత మన్నె క్రిశాంక్ ఖండించారు. ఈ వార్తను పబ్లిష్ చేసిన ఓ మీడియా ఛానల్‌పై మండిపడ్డారు. 'అటెన్షన్, వ్యూయర్‌షిప్ కోసం ఇలా అవాస్తవాలను ప్రసారం చేస్తారు. ఏదైనా ఉంటే కేసీఆర్ అధికారికంగా ఏదైనా టాప్ న్యూస్ ఛానల్ ద్వారా ప్రకటిస్తారు' అని ట్వీట్ చేశారు.



## ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగితే

# రక్తపోటు

### డాన్యూబ్ యూనివర్సిటీ పరిశోధనలో వెల్లడి

ప్లాస్టిక్ బాటిల్ నీళ్లను తాగితే రక్తపోటు వచ్చే ముప్పు పెరుగుతుందని ఆస్ట్రియాకు చెందిన 'డాన్యూబ్ ప్రైవేట్ యూనివర్సిటీ' పరిశోధకులు తేల్చారు. ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగటం ఆపేసి, రెండువారాల పాటు పంపు నీటిని తాగిన వారిలో రక్తపోటు తగ్గుదల కనిపించిందని పరిశోధకులు వివరించారు. 'జర్నల్ మైక్రోప్లాస్టిక్స్' వార్తా కథనం ప్రకారం, మనం తాగే నీళ్లలో, ఆహార పదార్థాల్లో మైక్రోప్లాస్టిక్ కణాలు ఉన్నట్టు సైంటిస్టులు గుర్తించారు. దీనికి కారణం.. ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగటం, ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ చేసిన ఆహారాన్ని తినటం. అత్యంత సూక్ష్మమైన ప్లాస్టిక్ కణాలు (5 మిల్లీమీటర్ల పొడవు).. పేగులు, ఊపిరితిత్తులు, రక్తనాళల్లోకి చేరుతున్నాయని, దీంతో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అధ్యయనం తెలిపింది.

## మెడికల్ సీట్లలో తెలంగాణ బిడ్డలకు అన్యాయం

స్థానికత విషయంలో తీసుకొచ్చిన కొత్త నిబంధన వల్ల మెడికల్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే ఈ నిబంధనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు అనేక అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. జీవో-33 ప్రకారం నిర్దేశించిన స్థానికతలో ని అంశాలు ప్రభుత్వం వేలితో విద్యార్థుల కండ్లను పొడిచినట్టే ఉన్నాయని మండిపడ్డారు. 9 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులే స్థానికులు అవుతారని ప్రభు త్వం చెప్తున్నదని, దీంతో చాలామంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారని ఆందోళన వ్యక్తంచేశారు.






## నీరజ్ స్వర్ణం గెలిస్తే.. ఫ్యాన్స్‌కు రిషభ్ పంత్ ఆఫర్!

ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా రేపు స్వర్ణం గెలిస్తే ఫ్యాన్స్‌లో ఒకరికి రూ.100089 బహుమతిగా ఇస్తానని క్రికెటర్ రిషభ్ పంత్ ట్విటర్‌లో ప్రకటించారు. ఆ ట్వీట్‌ను లైక్ చేసి, అత్యధికంగా కామెంట్ చేసిన వారికి అది దక్కుతుందన్నారు. ఇక అత్యధికంగా కామెంట్లు చేసినవారిలో తొలి 10మందికి ఫ్లైట్ టికెట్స్ ఇస్తానని పేర్కొన్నారు. 'భారత్‌తో పాటు దేశం బయటి నుంచి కూడా నా సోదరుడికి మద్దతు కూడగడదాం' అని పంత్ పిలుపునిచ్చారు.



## హసీనా లండన్ వెళ్లడం కష్టమే!

లండన్ వెళ్లి రాజకీయ ఆశ్రయం పొందాలని యోచిస్తోన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు పరిస్థితులు అనుకూలంగా లేవు. బంగ్లాలో చెలరేగిన అల్లర్లపై విచారణ జరిగే అవకాశం ఉండడంతో ఆమెను స్వదేశానికి అప్పగించకుండా రక్షణ కల్పించలేమన్న భావనలో బ్రిటన్ ఉన్నట్టు తెలుస్తోంది. పైగా దీనిపై ఐరాస సారథ్యంలో స్వతంత్ర దర్యాప్తు జరపాలని బ్రిటన్ కోరడం గమనార్హం.



# డబుల్ బ్లాక్‌బస్టర్ పక్కా

'పూరీ జగన్నాథ్ హీరోయిన్ అనిపించుకోవాలని ఎప్పట్నుంచో కోరిక. 'ఇస్మార్ట్ శంకర్'కి ఆడిషన్ కూడా ఇచ్చా.. కుదర్లేదు. డబుల్ ఫన్, డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ వుండే ఈ 'డబుల్ ఇస్మార్ట్'లో అవకాశం దొరికింది. చెప్పలేనంత ఆనందంగా ఉంది. పూరీ అద్భుతమైన విజన్ ఉన్న గ్రేట్ డైరెక్టర్. ఆయన సినిమాలో చేయడమే ఓ గొప్ప విషయం అయితే.. రామ్, సంజయ్‌దత్ లాంటి బిగ్‌స్టార్స్ ఉన్న సినిమాలో భాగం కావడం నిజంగా జాక్‌పాటే' అని కథానాయిక కావ్యథాపర్ అన్నారు.రామ్ కథానాయకుడిగా పూరీ జగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో ఛార్మీతో కలిసి నిర్మించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. బ్లాక్‌బాస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కి స్వీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులో ఓ కథానాయికగా నటించిన కావ్యథాపర్ మంగళవారం విలేకరులతో ముచ్చటించింది. 'ఇందులో నాది బోల్డ్ అండ్ స్ట్రాంగ్ కేరక్టర్. అలాగే స్మార్ట్‌నెస్, ఇన్నోసెన్స్ కూడా ఉంటుంది. ఇందులో ఫైట్స్ కూడా చేశా. రామ్ హైలీ ఎనర్జిటిక్. మా కెమిస్ట్రీ యూత్‌ని బాగా ఆకట్టుకుంటుంది. నా కెరీర్‌లో బెస్ట్ డ్యాన్స్ ఇందులోనే ఇచ్చాను. అలాగే సంజయ్‌దత్‌సార్‌తో నటించడం మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌పీరియన్స్. పేరుకు తగ్గట్టే 'డబుల్ ఇస్మార్ట్' డబుల్ బ్లాక్‌బస్టర్ అవుతుంది' అని నమ్మకం వ్యక్తం చేసింది కావ్య థాపర్.